ఆంధ్రజ్యోతి

తమిళనాడు

ఆదివారం

12 జూలై 2009


## గొంతు సమస్యలు రాకుండా

# వైద్యుల సలహాలు పాటించండి

తాంబరం, జూలై 11 (ఆన్‌లైన్): నగరంలోని శ్రీరామచంద్ర యూనివర్శిటీలో గొంతు సమస్యల నివారణపై జాతీయ స్థాయి రెండు రోజుల వర్క్‌షాప్ శనివారం జరిగింది. కర్ణాటక సంగీతంలో ప్రసిద్ధి చెందిన గాయని సుధా రఘునాథన్ ఈ కార్యక్రమంలో పాల్గొని వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. వాయిస్ డయాగ్నొస్టిక్స్ అండ్ థెరప్యూటిక్స్ పేరుతో నిర్వహిస్తోన్న ఈ వర్క్‌షాపు ఆదివారం కూడా జరుగుతుంది. ఈ వర్క్‌షాపులో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ ఈఎన్‌టీ సర్జన్‌లు, వాయిస్ పాతాలజిస్టులు తదితరులు పాల్గొన్నారు. వర్శిటీకి చెందిన లాంగ్వేజ్ అండ్ హియరింగ్ సైన్సెస్, స్పీచ్, ఈఎన్‌టీ డిపార్ట్‌మెంట్‌ల సంయుక్తంగా నిర్వహిస్తోన్న ఈ వర్క్‌షాపులో గొంతు సమస్యల నివారణకు నూతన వైద్య విధానాలపై చర్చిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జనాభాలో 7శాతం మంది గొంతు సమస్యలతో బాధపడుతున్నారని, స్వరం మార్పుతో ప్రారంభమయ్యే ఈ గొంతు సమస్యలు పూర్తిగా మాట్లాడలేని పరిస్థితికి దారితీసే ప్రమాదం కూడా ఉందని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో సుధా రఘునాథన్ మాట్లాడుతూ, కర్ణాటక సంగీతంలో తను సాధించిన కీర్తిప్రతిష్టలన్నింటికి భగవంతుడు తనకు ఇచ్చిన స్వరమే కారణమని, ఈ విషయంలో తాను అదృష్టవంతురాలినని పేర్కొన్నారు. మనదేశంలో చాలమంది గొంతు సమస్యలతో బాధపడుతున్నారని, గొంతు సమస్యలు రాకుండా వైద్యులు చెప్పిన సూచనలు, సలహాలను ప్రజలు పాటించాలని అన్నారు. గాయనీ గాయకులుగా రాణించాలనుకునే వారు ప్రతిరోజూ ఉదయం కొద్దిసేపు సంగీతంపై దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ ఈఎన్‌టీ-హెచ్ఎన్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జాన్ శామ్యూల్, వర్శిటీ ప్రొఫెసర్‌లు తదితరులు పాల్గొన్నారు.




వేదికపై ప్రముఖ కర్ణాటక సంగీత గాయని సుధా రఘునాథన్, డాక్టర్ జాన్ శామ్యూల్ తదితరులు